రాజధాని కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్‌గా నర్సింహారెడ్డి

కాచిగూడ, నవంబర్ 16: రాజధాని కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ చైర్మన్‌గా వేమిరెడ్డి నర్సింహారెడ్డి మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా, జాతీయ అర్బన్ బ్యాంక్ ఫెడరేషన్ డైరెక్టర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. కాగా.. రాజధాని కో-ఆపరేటివ్ బ్యాంక్ ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వ జాయింట్ రిజిస్ట్రార్ వై.పరిమళాదేవి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఏకగ్రీవంగా జరిగిన ఈ ఎన్నికల్లో వేమిరెడ్డి నర్సింహారెడ్డి వరుసగా ఐదోసారి చైర్మన్‌గా ఎన్నికయ్యారు. అలాగే వైస్ చైర్మన్‌గా టి.సుధీర్‌రెడ్డి, డైరెక్టర్లుగా బి.రాంరెడ్డి, ఎ.జైసాల్‌రెడ్డి, ఘన్‌శ్యామ్ భేటి, జి.క్రాంతిరెడ్డి, జి.నిర్మలాదేవి, కె.శ్రీరాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అర్బన్ బ్యాంకులు జారీ చేసే డీడీలకు, బ్యాంక్ గ్యారంటీలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించడం లేదన్నారు. జాతీయ బ్యాంకులతో సమానంగా అర్బన్ బ్యాంక్‌కు 8 బ్రాంచీల ద్వారా రూ.380 కోట్ల బిజినెస్ చేస్తోందన్నారు. త్వరలో మరోమూడు, నాలుగు బ్రాంచీలను ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన కార్తిక పౌర్ణమి ఉత్సవాలు

బాపూఘాట్ సం గం వద్ద ఉన్న రామాలయంలో శనివారం కా ర్తీక పౌర్ణమి ఉత్సవాలు భక్తి,శ్రద్ధలతో ముగిశాయి. కార్తీక పౌర్ణమి సందర్భంగా మూడు రోజుల పాటు జరిగిన పూజలు శనివారం నిర్వహించిన చక్రస్నానంతో పూర్తి అయ్యాయి. సంగం మఠాధిపతి రాహుల్‌దాస్ బాబా ఉత్సవ మూర్తులకు వేద మంత్రాలతో చక్రస్నానం కన్నులపండువగా పూర్తి చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మూడు రోజుల పాటు సంగం రామాలయంలో జరిగిన కార్తీక పౌర్ణమి పూజలకు నగరం నలు మూలలనుంచి భక్తులు తరలివచ్చారు. – మెహిదీపట్నం, నవంబర్ 16

ఫుడ్ ఫెస్టివల్..

విజయ్‌నగర్‌కాలనీలోని స్ప్రింగ్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు ఫుడ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ రజినీ, ఉపాధ్యాయులు క్రిష్ణ, నజ్మ, సూర్యకళ, హర్చన, నవనీత, శ్రీలత, తదితరులు పాల్గొని రుచి చూసి పిల్లల ప్రతిభను ప్రశంసించారు.

– తెలుగు యూనివర్సిటీ

19 నుంచి సంప్రదాయ కళల ఉత్సవం

సంప్రదాయ కళల ఉత్సవ ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న రమణాచారి, రఘురామ్

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 16: తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్, కిన్నెర కల్చరల్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ సంయుక్తాధ్వర్యంలో కిన్నెర 47వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రవీంద్రభారతి ప్రధాన ఆడిటోరియంలో ఈ నెల 19నుంచి 22వరకు, ప్రతి రోజు సాయంత్రం సంప్రదాయ కళల ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కిన్నెర సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురామ్ తెలిపారు. ఈ ఉత్సవాల ఆహ్వాన పత్రికను తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి రమణాచారి తన కార్యాలయంలో శనివారం సాయంత్రం రఘురామ్, తదితర కార్యవర్గ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఉత్సవాల్లో భాగంగా 19న పద్మశ్రీ పురస్కారగ్రహీత కనకరాజు శిష్యులు సుదర్శన్ బృందంచే గుస్సాడి నృత్యం, రాజయ్య బృందంచే కొమ్ముకోయ నృత్యం, వగం శ్రీనివాస్‌గౌడ్ సమర్పణలో జానపద కళాకారుల బృందంచే జానపద సంగీత నృత్య వైభవం, 20న గడ్డం పెద్దులు బృందంచే చిందు యక్షగానం, దొంతగాని వెంకటేశ్వర్లు బృందంచే సీతారామ కల్యాణం బుర్రకథ, డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి బృందంచే భక్తప్రహ్లాద కూచిపూడి యక్షగానం, 21న చయ నాటక బృందంచే పద్మశ్రీ పురస్కారగ్రహీత దలవాయి చలపతిరావు సమర్పణలో ఎస్. చిదంబరరావు దర్శకత్వంలో సుందరకాండ-తోలుబొమ్మలాట, ఆంజనేయస్వామి బృందం సమర్పణలో కె.ప్రసాద్ దర్శకత్వంలో మైరావణ వధ-తోలుబొమ్మలాట, 22న శ్రీరామ భట్టార్ భాగవతార్‌చే అన్నమయ్య-హరికథాగానం, పద్మాలయ ఆచార్య భాగవతారిణిచే పార్వతీ కల్యాణం-హరికథాగానం కార్యక్రమాలు ఉంటాయని రఘురామ్ వెల్లడించారు. ప్రతీ రోజు ప్రముఖులు పలువురు పాల్గొని కళలను పరిరక్షించి భావితరాలకు అందిస్తున్న గురువులను, కళాకారులను సత్కరిస్తారని తెలిపారు.

డీడీఎంఎస్‌లో వొకేషనల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 16: దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సభ వొకేషనల్ కోర్స్ సెంటర్‌లో పలు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్‌కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్స్ కోర్స్), ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డయాలసిస్ అసిస్టెంట్, ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ సర్టిఫికెట్ కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత 10వ తరగతి అని తెలిపారు. రెస్పిరేటరీ థెరపీ, ఈసీజీ, మెడికల్ ల్యాబ్, కార్డియాలజీ టెక్నీషియన్స్, రేడియోగ్రఫీ అసిస్టెంట్ వంటి పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత ఇంటర్మీడియట్ అని చెప్పారు. అన్ని వయసుల వారు కోర్సుల్లో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. కోర్సుల్లో చేరేందుకు ఈనెల 30 ఆఖరు అని అన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 83090 37134, 63058 95867 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బాధ్యతలు స్వీకరించిన వివిధ కళాశాలల నూతన ప్రిన్సిపాల్స్

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 16: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కళాశాలలకు ప్రిన్సిపాల్స్, కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ పదవుల్లో కొత్త వారిని నియమించిన నేపథ్యంలో వారు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ కాసిం, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ జి.ప్రభాకర్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ ఐ.శేఖర్, లా కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాంప్రసాద్ బాధ్యతలు అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని పలువురు అధికారులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు అభినందించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి : ఏసీపీ

గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్‌తో మాట్లాడుతున్న సిరుగుమల్లె రాజువస్తాద్

మెహిదీపట్నం, నవంబర్ 16: ప్రజల శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నామని గోల్కొండ పోలీస్ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. దేవాలయాలు, ప్రార్థనా స్థలాల వద్ద ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన అన్నారు. గోల్కొండ ఏసీపీ కార్యాలయంలో శనివారం మైత్రి, పీస్‌కమిటీ సభ్యులతో ఏసీపీ సమావేశం నిర్వహించారు. ఇటీవల దేవాలయాల వద్ద చోటుచేసుకున్న సంఘటనల నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. దేవాలయాలు , ప్రార్థనస్థలాల వద్ద భద్రతను పెంచుతామని, నిర్వాహకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఏసీపీ సూచించారు. ఈ సమావేశంలో మైత్రి, పీస్ కమిటీ అధ్యక్షుడు సిరుగుమల్లె రాజువస్తాద్, ప్రధాన కార్యదర్శి జైనుల్లాబెదిన్ అబేద్, వినాయక దయానంద్, అక్బర్, పరమానందం, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో భద్రత మెరుగు..

ప్రజల భద్రత సీసీ కెమెరాల ఏర్పాటుతో మెరుగవుతుందని గోల్కొండ పోలీస్ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. శనివారం లంగర్‌హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మందిరాలు, మసీద్‌ల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్‌తో కలిసి ఏసీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ప్రజల భద్రతకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతో ఉందని అన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ కృషి

గౌలిగూడలో ఏఈతో కలిసి పర్యటిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్

అబిడ్స్, నవంబర్ 16 : ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పార్టీ పాటు పడుతుందని గోషామహల్ నియోజకవర్గం ఆ పార్టీ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. గౌలిగూడలోని కొత్త బస్తీ, తదితర ప్రాంతాల్లో ఏఈతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా రహదారులపై గుంతలు ఏర్పడడంతోపాటు మ్యాన్‌హోల్స్ విరిగిపోవడం, తదితర సమస్యలను జీహెచ్ఎంసీ 14వ సర్కిల్ ఈఈకి వివరించగా.. ఆమె ఆదేశాల మేరకు ఏఈ కళ్యాణ్ ఆ ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను గుర్తించి రెండు రోజుల్లో పనులు పూర్తి చేయిస్తానని హామీనిచ్చినట్లు తెలిపారు. పలు ప్రాంతాల్లో కబ్జాలు చోటుచేసుకుంటున్నాయని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. అదే విధంగా దారుస్సలాం నుంచి గోషామహల్ పెట్రోల్ బంకువరకు రోడ్ వెడల్పు చేయగా ఆ రోడ్డు మధ్యలోకి వచ్చిన స్థంభాలను జరపాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వాసు, శ్రవణ్, జ్ఞానేశ్వర్, నరేశ్‌గౌడ్, విజయ్ ముదిరాజ్, మహేశ్, రాకేశ్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

మధుమేహంపై ఉచిత స్క్రీనింగ్ క్యాంపు

మధుమేహంపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల న్యూట్రిషన్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధులు

అబిడ్స్, నవంబర్ 16 : ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పబ్లిక్ గార్డెన్స్‌లో ఉచిత స్క్రీనింగ్‌తో మధుమేహంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల న్యూట్రిషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ స్క్రీనింగ్‌లో మణిలాల్‌షా పాల్గొని ప్రసంగిస్తూ.. మధుమేహం బారిన పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని సూచించారు. 50 సంవత్సరాలుపైబడినవారు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇన్సా ఫర్వేజ్, రమ్య పర్యవేక్షించారు.

ముస్లిం శ్మశాన వాటిక పనులు వేగవంతం

ముస్లిం శ్మశాన వాటిక పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

గోల్నాక, నవంబర్ 16: ముస్లిం శ్మశాన వాటిక పనులను వేగవంతం చేశామని అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ తెలిపారు. అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తా నుంచి నాగోల్ వెళ్లే కొత్త రహదారిలో ఏర్పాటు చేస్తున్న ముస్లిం శ్మశాన వాటిక పనులను శనివారం స్థానిక ముస్లిం నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఇప్పటికే శ్మశాన వాటిక ప్రహారీ నిర్మాణం పూర్తయ్యిందని, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి త్వరలోనే అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ముస్లిం విభాగం నాయకులు జాఫర్, అతిక్, రఫీక్, యూసుఫ్‌బాబా, జమీల్, అజార్, పాషా, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్

సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్న విద్యార్థులు

అంబర్‌పేట, నవంబర్ 16: బాగ్‌అంబర్‌పేట, డీడీకాలనీలో గల అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూ ల్‌లో శనివారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. క్రియాజాయినే-2024 పేరిట నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను పాఠశాల రీజినల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన వైజ్ఞానిక అంశాలను ఆయన పరిశీలించారు. డైరెక్టర్ రూపారెడ్డి, కౌశిక్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సులక్షణ అందా పాల్గొన్నారు. అలాగే.. అకడమిక్ హైట్స్ కేంబ్రిడ్జ్ పాఠశాలలో అస్మాకమ్ దేశః పేరుతో ఎడ్యూఫెయిర్‌ను నిర్వహించారు. ఇందులో చిన్నారులు వివిధ వేశధారణలో అలరించారు.

వివిధ వేశధారణల్లో చిన్నారులు

తెలంగాణ సంస్కృతి ప్రపంచానికే ఆదర్శం

పాన్ ఇండియా జాతీయ పురస్కారాలను ప్రదానం చేసిన వక్తలు

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 16: పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బిర్లా సైన్స్ సెంటర్ ప్రాంగణంలోని భాస్కర ఆడిటోరియంలో శనివారం పాన్ ఇండియన్ జాతీయ పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. పుడమి సాహితీవేదిక అధ్యక్షుడు చిలుముల బాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోదండరామ్, డాక్టర్ గజల్ శ్రీనివాస్, ఇండో కెనెడియన్ యూత్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు రొయ్యూరు శేషసాయి పాల్గొని ఉన్నతమైన తెలుగు భాషకు, సంస్కృతికి సేవచేస్తున్న వారిని గౌరవించుకోవడం మన కర్తవ్యమని అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, కళలు ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపును పొందాయని అన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 20మంది విభిన్న రంగాల వ్యక్తులను పాన్ ఇండియా-2024 జాతీయ అవార్డులతో సత్కరించారు. పిస్కా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ అద్దంకి రాజాయోనా, సంచలన స్కూల్ ఆఫ్ డ్యాన్స్ వ్యవస్థాపకురాలు పద్మకళ్యాణ్, తెలంగాణ యువజన సంఘాల సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ కూన గోపాలకృష్ణ, జనసమితి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు వర్ధిబోయిన బాబు, టీటీడీ బోర్డు మాజీ డైరెక్టర్ ధారావత్ బాల్‌సన్‌నాయక్ పాల్గొన్నారు. పలువురు కళాకారులు వేదికపై భారతీయ శాస్త్రీయ సంప్రదాయ కళారూపాలను ప్రదర్శించి ఆహుతుల ప్రశంసలు అందుకున్నారు.

అధికారులూ.. ఈ బడి ఉన్నదా లేదా..!

బస్తీబడి కష్టాలు తీరేదెన్నడో..

బీజేఆర్‌నగర్‌లో మూతబడ్డ సర్కారీబడి ఇబ్బందులు పడుతున్న స్థానిక విద్యార్థులు కళ్లముందు సమస్య కనిపిస్తున్నా పట్టించుకోని అధికారులు

బంజారాహిల్స్,నవంబర్ 16: అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ కల్పిస్తామంటూ కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలు నీటి మూటలుగా మారాయి.

- షేక్‌పేట మండల పరిధిలోకి వచ్చే ఫిలింనగర్ బీజేఆర్‌నగర్ బస్తీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మురుగునీటితో నిండిపోవడంతో పాటు భూమిలోకి కుంగిపోవడంతో మూడేళ్లుగా మూతపడింది. ఇక్కడి విద్యార్థులను సమీపంలోని ఇతర పాఠశాలల్లోకి చేర్చిన విద్యాశాఖ అధికారులు పాఠశాల నిర్మాణాన్ని గాలికొదిలేశారు. ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో పాటు స్థానికుల మధ్య విభేదాల కారణంగా ప్రభుత్వ పాఠశాల నిర్మాణం అంశం రెండడుగులు ముందుకు, నాలుగు అడుగులు వెనక్కి అన్న చందంగా మారింది.
- గతంలో బీజేఆర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో సుమారు 300మందికి పైగా విద్యార్థులు చదువుకునేవారు. అయితే పాఠశాల నిరుపయోగంగా మారడంతో ఇక్కడి విద్యార్థుల్లో కొంతమంది సమీపంలోని మహాత్మాగాంధీనగర్ బస్తీలోని ప్రాథమిక పాఠశాలలో చేరగా మరికొంతమంది ప్రైవేటు స్కూళ్లలో చేరిపోయారు. ప్రైవేటు స్కూళ్ల ఫీజులు కట్టుకోలేని పలువురు విద్యార్థులు చదువు మానేసి అల్లరి చిల్లరగా తిరుగుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- పేదలు నివాసం ఉంటున్న బీజేఆర్ నగర్ బస్తీలోని ప్రభుత్వ పాఠశాలను కూల్చేసి కొత్త స్కూల్ నిర్మాణం కోసం గతంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బడిబాట పథకం కింద నిధులు మంజూరు చేశారు. అయితే ఎన్నికలు రావడంతో ఆ పనులు ప్రారంభం కాలేదు.
- కొత్త ప్రభుత్వం వచ్చి తర్వాత స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరినా ఇప్పటివరకు స్కూల్ అభివృద్ధి విషయాన్ని గురించి పట్టించుకోవడం లేదని స్థానిక బస్తీనేత నడిమింటి కృష్ణ ఆరోపించారు.
- ప్రభుత్వాలు మారినా తమ బస్తీలోని ప్రభుత్వ పాఠశాల పరిస్థితి మాత్రం మారడం లేదన్నారు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్‌తో పాటు సీఎం రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించి బీజేఆర్ నగర్ బస్తీ ప్రభుత్వ పాఠశాల పరిస్థితిని మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

కాలిపోయిన సీజ్ చేసిన కార్లు

పోలీసులు వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకుని సీజ్ చేసిన రెండు కార్లు పోలీస్ స్టేషన్ ముందు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ సంఘటన లంగర్‌హౌస్ పోలీస్ స్టేషన్ ముందు శనివారం రాత్రి 10గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. సమీపంలోని అగ్నిమాపక కేంద్రం నుంచి ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పి వేసింది. ఈ ప్రమాదంలో రెండు కార్లు పూర్తిగా కాలిపోయాయి.

– మెహిదీపట్నం నవంబర్ 16

ఒంటరి మహిళలకు చేయూత

ఆర్‌జే ఇన్‌స్పిరేషన్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతిలో ఒంటరి మహిళలకు చేయూత కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన ప్రభుత్వ మాజీ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి, ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ జీవన్‌లాల్‌లు ఒంటరి మహిళల పిల్లలకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒంటరి మహిళలకు చేయూతనందించేందుకు ఆర్‌జే ఇన్‌స్పిరేషన్ హ్యాండ్ సంస్థ ముందుకు రావడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో సినీ నటుడు నరేశ్, మాజీ కార్పొరేటర్ కేవీ రామారావు, ఉమాకార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

– రవీంద్రభారతి, నవంబర్ 16

సన్మానం..

ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించే నాయకులనే ప్రజలు కోరుకుంటారని కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. శనివారం ఆయనను నాందేడ్ ఎమ్మెల్యే అభ్యర్థి సయ్యద్ మోయిన్ సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. – మెహిదీపట్నం, నవంబర్ 16